# సరళ రేఖలు

రాత్రి పదకొండు అయింది. చంద్రం కాగితాల చుట్టపట్టుగుని ఇరుప్రక్కలా ఇళ్ళవైపు తీక్షణంగా చూస్తూ శల్యపరీక్ష చేస్తూ పోతున్నాడు. ఒక్కొక్క దగ్గిర ఆగుతున్నాడు! మళ్ళీ నడుస్తున్నాడు. మనస్సులో ఏదో తీవ్రమైన ఆతృతతో కూడిన కోర్కెవుంది. దానిని పొందడానికే యీ ప్రయత్నం అంతాను.

దాని కోసం ఎన్నాళ్ళనుండో వేచివున్నట్టుంది. ఆకలిగొన్న సింహంలా, ఎడబాటు కల ప్రియునిలా అలవాటయిన వస్తువు లేక చికాకుతో అంకాక పడే బాధతోనూ వున్నట్టుంది.

అడుగడుక్కీ రకరకాలవాళ్ళు ప్రదర్శనానికి నిలబడివున్నారు. ఒక్కొక్క దగ్గిర ఒక్కొక్కరు వున్నారు. ఒక్కొక్క దగ్గిర నలుగురయిదుగురు జట్లు జట్లుగా వున్నారు. మరోదగ్గర పది పదిహేనుమంది గుంపులుగా వున్నారు. రక-రకాలుగా సింగారించుకున్నారు. నవ్వుతున్నారు. క్రీగంట చూస్తూ అనేక రీతులుగా వచ్చేపోయేవారికి సంజ్ఞలు చేస్తున్నారు. చేతులతో పిలుస్తున్నారు. అంగవిన్యాసం చేస్తూ శరీర ప్రదర్శనం చేస్తున్నారు. సరసోక్తులు విసురుతూ సిగ్గు లజ్జ లేకుండా అనేక విధాలుగా రక రకాల పోజుల్లో నిలబడుతూ, కూర్చుంటూ, తిరుగుతూ ఒళ్ళు విరుచుకుంటూ విటుల్ని ఆకర్షించే చేష్టలు చేస్తున్నారు. విరహగీతాలు పాడుతూ, రమ్మని పిలుస్తూ సరసులని ఆహ్వానించడానికి అతి ప్రయత్నాలు చేస్తున్నారు.

అది సానివీధి అని చంద్రానికి తెలుసు. అక్కడికి వెళ్ళినవారికి లోకంలో చెడ్డపేరు వస్తుందనికూడా తెలును. కాని ఆఖరికి ఆలోచించి ఆలోచించి అతను చేసిన సాహసం యిది. తెగించిన పని ఇది. అంతకన్న అతనికి గత్యంతరం లేదు. ఎందుకు వెడుతున్నాడో, అదిలేక తను జీవించలేడు. ఇన్నాళ్ళు సహించాడు ఇక ఓర్పులేదు. అది లేకపోతే బ్రతకలేడు. మనస్సు పనిచెయ్యదు, ఆత్మ శాంతించదు. తనలోనున్న శక్తి, వాంఛ, ఉద్రేకం నశిస్తుంది. తనలోనున్న 'కళ'కి కళంకంవస్తుంది అందువల్ల అతని అభీష్టం తీరితే లోకంతో పనిలేదు.

అది అతనికి మొదటిసారి అలాటి ప్రదేశాల్లో నడవడం. ప్రదర్శనశా లో చిత్రాల్లాగ ఒక్కొక్కటినీ దాటిపోతున్నాడు. కానిఏఒక్కటీ ఆకర్షించలేదు. ఏ ఒక్కటీ కళాస్వరూపంగా లేదు. దానిని ఆరాధించి ఆశయసిద్ధిని పొందలేడు. చిత్రప్రదర్శన శాలల్లో ఎన్ని చిత్రాలువున్నా ఏవో కొన్ని మాత్రమే ఆకర్షించి పేరు ప్రఖ్యాతులు పొందుతాయి. అప్పుడు అందులోని విశిష్టత, ఉత్కృష్టత, చిత్రకారుని శక్తి తెలుస్తుంది అలాగే ఈ ప్రపంచంలోవున్న సృష్టిలోకూడా కొంతమందే ప్రత్యేకించి అధికులుగా అతీతులుగా కనబడుతారు. వారు ఎక్కడవున్నా ఆకర్షిస్తారు. అందుకు కారణం వారిలో ఏదో ఒక గొప్పతనమే. దీనికి అనుభవం జ్ఞానం కూడా ముఖ్యమే

పూర్తిగా ఆ వీధిని దాటిపోయినాడు చంద్రం గాని ఏ ఒక్కరినీ ఎంచుకోలేకపోయాడు. నాలుగయిదుసార్లు ఆ వీధిలోనే తిరిగాడు. అప్పటి కప్పుడే చుట్టూవున్న వాతావరణం ఇతడిని చూసి పళ్ళికిలించ సాగింది ఒక విధమైన అనాదరం, చికాకు, హేళన ప్రారంభమయింది.

చంద్రం నిరుత్సాహం పడ్డాడు. ఆశ అడుగంటి, ఉద్రేకం నశించి భావంలేని చిత్రంలా అయిపోయాడు. కృంగిపోయాడు. శరీరం చమటలు పోసింది. ఒకదగ్గర ఆలోచిస్తూ నిలబడిపోయాడు. ఆ ఆలోచనలోనేఅతని దృష్టి ఒక మేడమీద కిటికీ దగ్గర నిల్చివుంది. అక్కడొక సంఘటన జరుగుతున్నా దానికి బదులు తన ఆలోచనలోని విషయాలే అతనికి కన

బడుతున్నాయి. ఆ దృష్టి తాలూకు కేంద్రీకరణంలో అలా కొంతసేప యింది. ఆలోచనలుపోయి జాగ్రతావస్థలోకివచ్చాడు. ఇక్కడ ఆకిటికీలో అక్కడి దృశ్యం కనబడుతూంది.

ఆ కిటికీలో ఒకామె కనిపించింది. అక్కడనుండి మెల్లగా మేడ మెట్లుమీంచి దిగుతూంది ఆ ఒయ్యారం, ఆ సొగసు, ఆ అందం, ఆ వయసు ఒక్కరికి మాత్రమేకాదు, ప్రతిదినం ఎంతమందిదో? చంద్రం కంటికి కరువుతీరినట్టు అయింది. ఆమె వీధి గుమ్మం దగ్గరకి వచ్చి అజంతా బొమ్మలా నిలుచుంది. ఆమె కళ్ళలో ఎప్పుడూ నిరీక్షణ వుంటూనే వుంటుంది.

చంద్రం దగ్గరికి వెళ్ళాడు. అమె నవ్వి పలకరించి లోపుకి ఆహ్వానించింది. మేడమీదకి ఆమె వెనకాలే వెళ్ళాడు. ఒక చిన్నగది దానికి ఒక కిటికీ. అక్కడికి వెళ్ళి ఆ కిటికీలోంచి ఇందాక తను నిలుచుని చూసిన ప్రదేశం చూశాడు. ఆ చీకట్లో దీపాలక్రింద పురుగుల్లా తిరుగుతున్నారు జనం...

ఆ గదిలో అలంకరణ బాగానేవుంది.

"కూర్చోండి" అంది ఆమె పందిరిమంచం చూపిస్తూ. ఆ మాటకి ఇటు తిరిగాడు చంద్రం ఆశ్చర్యపోతూ "అలాగే" అన్నాడు. కానీ కూర్చోలేదు.

"అయిదు రూపాయలు" అంది కొంచెం సిగ్గుపడుతూ.

"సరే..." అంటూ ఇచ్చాడు.

ఆమె తలుపు మూసింది. సిగ్గులేకుండా...ఈయన కెదురుగానే స్వయంగా తనకు తానే వివస్త్ర అయింది. తన అందం, ఆకారం, అవయవాలు ఓరగా, గర్వంగా చూసింది. అతని చూపుల తీక్షణతకి తట్టుకోలేక సిగ్గుతో నవ్వుతున్నట్టు నటించింది.

ఆయనని లెచ్చగొట్టడానికి అమె ప్రయత్నం అయివుండొచ్చు. అతనికి ఆ సందర్భం వేరొకవిధంగా చిరపరిచిత మయిందే. అయినా

మామూలుగా అతి సహజంగా చూసి ఆలోచిస్తున్నాడు. ఆమె అవయవాల వంపులని కాటోలు నిశితంగా చూస్తున్నాడు. అతని దృష్టికి ఆమె అంతకాలం తట్టుకోలేక ఒక చిన్న వల్లెవాటు భుజాలమీంచి క్రిందవరకు కప్పుకుంది. దగ్గరగా వచ్చి చేతులు అతనికోసం చాచింది.

కాని ఆమె అనుకున్నట్టు చంద్రం ఆమెను తన చేతులను జాచి ఆహ్వానించి కౌగిలించుకోలేదు. ఆమెని తాకనయినాలేదు. ఆమెని కామించే లక్షణాలను ఏమాత్రం చూపకపోవడం చేత ఆమె చాలా వింతపోయి చూస్తూ నిలబడిపోయింది. "ఆ బట్టకూడా తీసేసి అక్కడ ఆ స్టూలు దగ్గర నిలబడు" అని చంద్రం నిశ్చలంగా అన్నాడు. దానికి ఆశ్చర్యపోయింది ఆవిడ.

"అదేమిటి? ఎందుకు" అని అడిగింది దూరంగా జరుగుతూ.

"చెబుతాను. నేనెలా చెబితే అలా కొంచెంసేపు నిలబడు నీకు కావలసింది దక్కదా? నేనది ముందే ఇచ్చానుకదా!"

"మీరన్నది నాకర్థం కాలేదు. మీకెదురుగుండా వస్త్రం లేకుండా నిలబడాలా? ఏమిటీ వికారం"

"నేనడక్కుండా నువ్వుచేసింది అదేకదా? అడిగేసరికి అలా అంటావేం. ఒక్క అరగంట! నిన్ను చూసి కొన్ని స్కెచ్‌లు వేసుకుని పోతాను!" అని అన్నాడు. దానికి ఆమె మొదట తడబడ్డా...

"అటువంటి వేమిటో ఇక్కడ జరగవనితెలీదా మీకు? మీరిచ్చిన దానికి మావల్ల పొందవలసినదేదో అది పొంది వెళ్ళవచ్చును. కాలం వృథా చేయకండి. మా యజమాని ఆలశ్యానికి ఒప్పుకోడు. మళ్ళీ అవతరికి పోవాలి. మీతోనే కాలక్షేపం చేస్తే కుదరదు!" అని ఆమె విసుగుగా అంది.

"ఈ కాలాన్ని నేనెలా వినియోగించుకుంటేనేం! నీకు కావలసింది డబ్బుకాదా!" అని మళ్ళా అన్నాడు.

"కాని ఏపని చేసేచోట ఆపనే చేయాలి! ఇది ఎటువంటి ప్రదేశమో మీకు బాగా తెలుసు!" అని ఆమె జవాబు చెప్పింది.

"నేను అందుకు రాలేదు. నేనొక చిత్రకారుణ్ని. చిత్రాలు శాస్త్రోక్తంగా స్వాభావికంగా వ్రాయగలగాలంటే, అవయవాల తీరులూ, వంపులూ వాటి అమరిక, పొందిక, ఆకారం పరిమాణాలూ ఇవి చిత్రకారుడికి క్షుణ్ణంగా తెలియవలసిన విషయాలు. అందుకు సర్వదా కృషిచేయాలి. అందుకోసం సృష్టినంతటినీ, అందులో ప్రతి వస్తువునీ మోడల్‌గా పెట్టుకొని ప్రతి అణువూ చదవాలి. అప్పుడే అందులో పగిపూర్ణత సిద్ధిస్తుంది. ఆ తరువాత చిత్రకారుడు తన శక్తి తెలివితేటలూ ఉపయోగించి, అందులోని భావాన్ని కళాత్మకంగా చిత్రించి చూపాలి. అప్పుడే ఒక ప్రత్యేకత కీర్తి వస్తుంది. అతను వ్రాసిన ప్రతిచిత్రం ఒక కళాఖండం అవుతుంది. ఆ గొప్పతనం సాధించాలంటే ప్రకృతిని అందులోని వస్తువులనీ మోడల్‌గా పెట్టుకొని చదవాలి అది సాధించాలనే నా ఉద్దేశ్యం.

కాని కొన్ని కారణాలవల్ల పరిస్థితుల ఒత్తిడివల్ల కళా వాతావరణాన్ని వదిలి ఈ ప్రదేశాలకి రావలసి వచ్చింది. కాని నాకు మోడల్ దొరకక ఇన్నాళ్ళూ వృథాచేశాను. ఎక్కడ వెతికినా, ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. చిత్రాలు వ్రాస్తే నా చెయ్యి వణుకుతూంది. నా మానస్సు మోడల్ కోసం వెతుకుతూంది. ఏ మంచిరూపాన్ని చూసినా ఆ ప్రతి రూపాన్ని అతివేగంగా, మబ్బులా, వెన్నెలా, తేలిగ్గా వేద్దామని అనిపిస్తుంది? కాని నాకు మోడల్‌గా ఎవరునుంచుంటారు?

ఎంతమందినో అడిగాను, నచ్చచెప్పేను...కాని ఎవరూ సమ్మతించలేదు. ఇక్కడ వ్యభిచారానికి బహిరంగంగా ఒప్పుకుంటున్నారుగాని ఉపకారానికి, మర్యాదగా సహాయం చేయడానికి ఒప్పుగోకుండాఉన్నారు. యీపని ఏమిటో, నీచంగాను, కూడని పనిగాను, వ్యభిచారం కన్నా తక్కువగానూ చూస్తున్నారు.

ఆఖరికి ఈ వీధిలోకి రావడానికి ఇష్టం లేకపోయినా, నా కోర్కె తీరే గత్యంతరంలేకవచ్చాను. చూసేను. ఎవరూ కళారాధనకి తగినట్టు

కనబడక, తిరిగి వెళ్ళిపోదామనుకొనే సరికి నువ్వు కనిపించావు. అదృష్టవశాత్తూ వెదుక్కొని నీవు సరియయిన మోడల్‌వని వచ్చాను. అంతే నాకు మరో ఉద్దేశ్యం లేదు. ఏ విధంగా నిన్ను చూసినా నాకు ఆకోర్కె ఒక్కటే. నిన్ను ఎన్ని విధాలుగా నా కాగితాలమీదకు ఎక్కించాలో, ఎన్ని భంగిమలలో చిత్రించాలో అదే. అది ఒక్కటే భావం కలుగుతుంది నాలో. దయవుంచి అలా నిలబడు. కాలం వృథాగా గడచిపోతూంది. నాకీ ఉపకారం చేసిపెట్టు!" అని వుద్రేకంతో అన్నాడు చంద్రం. అదంతా బొమ్మలా వింటున్నది-ఆవిడ. అయినా—

"మీవల్ల కళగురించి కొంతవరకూ తెలిసింది! ఇహ మీరు వెళ్ళండి చాలాకాలం అయిపోయింది ఇప్పటికే."

"ఏమి డబ్బు పుచ్చుకొన్నావే!"

"అవును అందుకు ప్రతిఫలం ఇవ్వడానికి నాకేమి అభ్యంతరం లేదు...మీ ఇష్టం...కానిచ్చి...పోవచ్చును." అంది సిగ్గు విడిచి—

"శరీరాన్ని నాశనం చేసినా జంకవు! సరికదా అందుకు ఆహ్వానిస్తావుకూడ! కాని నే కోరింది నీలో వుండే కళని, నీ అవయవ సౌష్టవాన్ని, భగవంతుడు నీలో సృజించిన మహోత్కృష్టమయిన, అందాన్ని కళాత్మకమయిన ఆ సౌందర్యాన్ని, అదే నాకు కావాలి. నిన్ను తాకవలసిన పని నాకు లేదు. నా చిత్రానికి నువ్వు వస్తువవు అంతే. కొంచంసేపు నాకు మోడల్‌గా వుండు. దీనికి ఒప్పుగోవేం? ఎంత వింతగా వుంది.

అరె! "శరీరాన్ని నాశనం చేయండి! ఏం చెయ్యండి...అంతే నేనిక్కడ అందుకే వున్నాను. దానికీ కాలంలో పని...కట్టుబాట్లు, కాలచక్రంతోపాటు మేమూ తిరగాలి. మేడ ఎక్కాలి. మళ్ళీ దిగి, గుమ్మంలో నిలబడాలి. గంటలకొద్దీ ఒక్కరితో కాలక్షేపం చేస్తే నా బ్రతుకు ఈ విధంగానయినా, నడవదు." అని విసుగుతో అంది.

"నువ్వన్నది ఏమిటి! మంచికి ఎందుకు అంగీకరించవు."

"మంచి, చెడూ ఒక్క దగ్గర లభించవు. ఏది ఎక్కడ దొరకాలో అది అక్కడే దొరుకుతుంది. మీ అన్వేషణలో వుంది అది."

అయితే ఇన్నాళ్ళుగా నేను వెదికి వెదికి నీలో చూచిన ఈ అందాన్ని కళని, వినియోగించకుండా వెనక్కి తిరిగివెళ్ళి పోవలసిందేనా? వెళ్ళగలనా?"

"ఇప్పటికే నేను అయిదు రూపాయలు నష్టపెట్టాను. మా యజమానకి దేనికయినా వాతావరణం కావాలి! అది లేకపోతే, మంచికూడా చెడ్డవుతుంది. చెడ్డదికాదు మంచి అవుతుంది. ఇక్కడ మీరు కోరే వాతావరణం లేదు...సెలవు తీసుకోండి." అని అంది నిర్మొహమాటంగా.

"ఎక్కడికి?"

"మీ కోర్కె తీరే వాతావరణం వున్నచోటికి" అని గంభీరంగా అన్నడి.

"అవును...నన్ను పోషించుకుందికాని, కళని వదిలేశాను. కాని తిరిగి అక్కడికి పోతే దాన్నిచూసి ఆనందించడానికయినా భయపడి బ్రతకనేమో!" అని అన్నాడు నిట్టూర్చి.

"అవును! నేనూ నా పొట్టకోసమే, మానవత్వం, వ్యక్తిత్వం, సిగ్గు లజ్జ, మానం, మర్యాదా అన్ని వదులుకొని ఈ వృత్తిలో ప్రవేశించాను ఇది వొదిలి ఇప్పుడు అక్కడికిపోతే బ్రతకలేను. బ్రతక నివ్వరు. అవునంటారా" అని అంది నిశ్చలంగా.

"అయితే కడుపుకోసం ఎన్ని కక్కుర్తులయినా పడి ఎంత నీచత్వానికి దిగినా పరవాలేదంటావు? అది నిజమే కాబోలు. శాస్త్రోక్తంగా వ్రాసిన చిత్రాలు అందరికి నచ్చవు! వాటిని ఫోటోలతో పోల్చి అలాతే వంటారు. ఎందుకూ పనికిరానివని వేటినయితే కళాకారుడు అనుకుంటాడో వాటిని జనం కోరతారు; అస్వాభావికమయిన అనుకరణని అందరూ మెచ్చుకుంటారు. అశాస్త్రీయమయిన సంగీతాన్ని వినిపించి సంగీత విద్వాంసుణ్ని మెచ్చుగోమంటారు. ఏదో ఒక పుస్తకం వ్రాసి, దానిని పొగుడుతూ వ్రాయమని కవిని అభ్యంతరపెడుతారు. దెయ్యం పట్టినట్టు వేసే అడుగులని గెంతులని, మెచ్చుకోమని నాట్యాచారుణ్ని బలవంత

పెడతారు. అర్థంలేని గీతలుగీయమని కళకి ప్రాముఖ్యం లేకపోయినా, ఆకర్షణకే స్థానం ఇచ్చి చిత్రాలను వేయమంటారు చిత్రకారుణ్ణి.

అటువంటివాటిల్లో, కళగాని, శాస్త్రంగాని, గొప్పతనంగాని లేక పోయినా, ఆకర్షణవుంటేచాలు. ఆ మాత్రం దానికి వాటిని అనుకరించక పోతే, ఎలాటి చిత్రకారునికయినా, విలువ, గౌరవం, ఇవ్వడంలేదు. వాడేమీ రానివాడిక్రిందే లెక్క, అంచేత, ఎటువంటి శిక్షణ పొందినవాడ యినా, పరిస్థితుల వత్తిడికి, విధి లేక ఇలాటి తప్పులను అనుసరించవలసి వస్తుంది. దానివల్ల కళకూడా దెబ్బతింటూ వుంది" అని చంద్రం వుప న్యాసంలా చెప్పేడు. అదివిని—

"మీరు చెప్పింది అక్షరాలా నిజం... కడుపుకోసం కక్కుర్తి పడమని నేను అనలేదు. కాని ఒక్క విషయం, అందరూ అందల మెక్కితే మోసేవారెవరు? అందరికీ అవకాశం దొరికితే, ఎవరికీప్రత్యేకత రాదేమో? కాని కృషి తర్వాత త్యాగం ముఖ్యం, పట్టుదల కావాలి. పట్టు దలతో, ఎదుర్కొని ఒకే గురితో దీక్షతో కృషిచేస్తే ఏదయినా లభించ గలదేమో! అలా చేయకుండా, అనుకున్నది పొందలేకపోయేమనిఅనుకో వడం, మరొకరి పొరపాటు మాత్రంకాదు. ఇన్ని తెలిసి నన్ను నిర్బంధిం చడం భావ్యంగాలేదు..."

"మరి ఇప్పుడు అటువంటి దీక్షతోనె, పట్టుదలతోనే ప్రయత్నించి స్థానాన్ని పొందకూడదా?"

"పొందవచ్చునేమో! గాని ఒకసారి పతనమయిన తర్వాత, ఆ పట్టుదల దీక్ష సడలిపోతుంది. ఒకవేళ సాధించినా, ఈ వాతావరణానికి, అలవాట్లకి అలవాటుపడిపోయి, ఆ వాతావరణానికి తట్టుకోలేమేమో! తట్టుకో చూచినా ఒక్కొక్కప్పుడు వెనక్కి తరిమేస్తారుకూడా" అని అంది.

"నిజం! వెదలా...నాకు శక్తివుంటే ధైర్యమే ఉంటే,కడుపుమాడి చచ్చినా, లోకం ఏమన్నా, ఎదిరించి తిరిగి ఆ వాతావరణంలోకి పోతా. అంతేగాని... చీకట్లో తిరుగుతూ వెలుతురుకోసం ఏడిస్తే ఏం లాభం?

వెలుతురును వెతుక్కుంటూ పోవాలి...! వెడతా..." అంటూ వెళ్ళిపోతున్నాడు చంద్రం.

ఆ వేశ్య అతడిని పిలుద్దామని ఇటువైపు తిరిగేసరికి ఎదురుగుండా నిలువుటద్దంలో తన నగ్నరూపం కనిపించింది. తనుమీద వేసుగున్న పల్లెవాటు తీసి మరోమాటు చూసుకుంది. ఏమనుకుందో వెంటనే అతడిని పిలిచింది.

"ఇప్పటికే నీకాలం చాలా వృథాచేసాను" అన్నాడు తల వంచుగొని.

"లేదు—నేనే వృథాగా మీతో వాదించాను. మీకు సంతోషం—ఆనందం కలిగించడం నా విధి—" అని అంది చిన్న నవ్వు నవ్వుతూ.

"అంటే—" అని అనుమానంగా అన్నాడు.

"మీ దగ్గిర డబ్బు పుచ్చుగున్నాను."

"నేనడగలేదే ఇమ్మని"

"కాబట్టి—" అని అంటూ స్టూలులాగి, ఒక ప్రత్యేకమైన భంగిమలో నిలబడింది.

చంద్రం కళ్ళు ఎగాదిగా చూశాయి! ఆ మోడల్‌ని చూస్తే గొప్ప గొప్ప చిత్రాకారులు వ్రాసిన ఎన్నో చిత్రాలు స్మృతిపథంలోకి వచ్చాయి,

"మారినట్టున్నావే!" అని అన్నాడు చంద్రం.

"ఇది నా విధి" అన్నది ఆమె.

"మరి మీ యజమాని..."

"నే చూసుగుంటాను...మీ ఇచ్చే గౌరవం నాకూ నా జన్మకీ ఎక్కువ—ఒకవేళ నా కిక్కడ స్థానం లేకపోయినా నీచపు బ్రతుకు—ఎక్కడయినా బ్రతకవచ్చు...మీలాగే వెతుక్కుంటూ పోతాను."

చంద్రం ఆలస్యం చెయ్యకుండా కాగితాలు విప్పి, క్రయిన్ తీసి ఎన్నో విధాలుగా ఎన్నో భంగిమల్లో స్కెచ్‌లు వేసుగొని తృప్తి

చెందాడు. ఆమె వింతగా, ఆశ్చర్యంగా చూస్తూంటే అధిక ప్రసంగం చెయ్యకుండా, వెడతానని మాత్రం చెప్పి ఇవతలికి వచ్చేసాడు.

ఆయనకి తృప్తివల్ల హృదయం నిండింది. ఆమెకు ఏదో ఎన్నడు లేని ఆనందం, గౌరవం లభించింది. అతనికి ఒక కోరిక చిరకాలమైన తర్వాత తీరింది. బహుశా ఒకసారి ఒప్పుగున్నాక తిరిగి ఒప్పుకోదా ? అని అనుకున్నాడేమో! ఆమెకూడా మళ్ళీ రాడా ? అని అనుకుందేమో ? ఆ ఆనందంలోను ఏమో? ఆ మాట ఎవరు అడగలేదు !

బయటకు వచ్చేస్తూంటే మాత్రం ఒకరిద్దరు తనకుతెలిసిన వాళ్ళు కనబడి పలకరించారు! వాళ్ళెందుకొచ్చారో? తను పలకరించలేదుగా ?

ఆయనకి ఆ సమయంలో భయంగాని, జంకుగాని, ఏమీలేదు. ఏదో విద్యాలయంలోకి పోయి నేర్చుగున్నట్టుగా వుంది. మనసు తేలిక పడింది. హృదయం శాంతించింది...

కాని ఆ మర్నాడు...అందరూ

"చంద్రం సాని కొంపలు పట్టేడ"న్నారు.

నిజమే—

చంద్రం సానివాళ్ళని మరిగేడన్నారు...

నిజమే—

చంద్రం వ్యభిచారి, అన్నారు- -

నిజమా? నిజమా!...

కాదు కాని—చంద్రం చేసిన పొరపాటు...తాటి చెట్టు క్రింద పాలు త్రాగడమే !

ప్రగతి పథం 15–5–65